RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 99 | ఏప్రిల్ 29 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 99 | April 29 Wednesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


నేడు బెంగాల్ రెండో విడత ఎన్నికలు

2

## మహిళా బిల్లును ఆమోదిస్తాం

### ప్రధానమంత్రి నరేంద్రమోడీ



**వారణాసి జన సంఘర్షణ**

మహిళా సాధికారత దిశగా చారిత్రాత్మక ముందడుగు వేస్తూ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లును కచ్చితంగా ఆమోదించి తీరుతామని ప్రధాని నరేంద్ర మోదీ ఘంటాపథంగా చెప్పారు. వారణాసిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ఈ కీలక చట్టం అమలు కాకుండా ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలపై తీవ్రస్థాయిలో

➤ మిగతా 2వ పేజిలో..

## నూతన డీజీపీగా సీవీఆనంద్



**హైదరాబాద్ జన సంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర నూతన పోలీస్ బాస్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఆ స్థానంలో సీవీ ఆనంద్‌ను ఎంపిక చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. యూపీఎస్సీ నిబంధనల ప్రకారం పంపిన ఎంపానెల్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, సీనియారిటీ ప్రాతిపదికన ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించింది. ప్రస్తుతం హోం శాఖలో ప్రత్యేక

➤ మిగతా 2వ పేజిలో..

## నేడు టెన్త్ రిజల్ట్స్




**హైదరాబాద్ జన సంఘర్షణ**

తెలంగాణ పదో తరగతి విద్యార్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. రాష్ట్రంలో టెన్త్ పరీక్షా ఫలితాల విడుదల తేదీని విద్యాశాఖ అధికారికంగా ఖరారు చేసింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే మొదటి వారంలో ఫలితాలు వస్తాయని భావించినప్పటికీ, యుద్ధప్రాతిపదికన ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వ పరీక్షల విభాగం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలను వెల్లడించనుంది. ఈ ఫలితాలను ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. మార్చి 14వ తేదీన ప్రారంభమైన ఈ కీలకమైన పదో తరగతి ప్రధాన పరీక్షలు ఏప్రిల్ 13వ తేదీతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు

## ఫ్యూచర్ కోసం..

### అంతర్జాతీయ ప్రమాణాలతో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తాం.. సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జన సంఘర్షణ**

తెలంగాణ భవిష్యత్ తరాల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని, ఇది కేవలం ఒక నగరం మాత్రమే కాదు, రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. గత నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగిస్తే, తాము ఇప్పుడు భారత్‌లోనే నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో దీన్ని నిర్మిస్తున్నామని, ప్రపంచ స్థాయి పెట్టుబడులు ఈ నగరానికి తరలివస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. దాదాపు 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందని, జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని ఆయన ప్రకటించారు. ఈ భారీ ప్రాజెక్టులో స్థానిక గ్రామాల ప్రజలను మరియు ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధిలో భాగం కావాలనుకునే గ్రామాలు గ్రామసభల్లో తీర్మానం చేసి కలెక్టరుకు పంపాలని, తద్వారా ఆయా ప్రాంతాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి చేరుస్తామని హామీ ఇచ్చారు. నగర నిర్మాణానికి

➤ మిగతా 2వ పేజిలో..

## ఇంధన కొరతను ఖండించిన కేంద్రం



**న్యూఢిల్లీ జన సంఘర్షణ**

పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగనున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో మరియు ప్రజల్లో వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే చమురు ధరలు ఆకాశాన్నంటుతాయనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ఎన్నికల ముగింపునకు, ఇంధన ధరల మార్పునకు ఎలాంటి సంబంధం లేదని వినియోగదారులకు భరోసా ఇచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు గత రెండు నెలల్లో దాదాపు 50 శాతం మేర పెరిగిన మాట

➤ మిగతా 2వ పేజిలో..

## అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైలు..

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**అమరావతి జన సంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో ఐటీ మరియు రవాణా రంగాలు సరికొత్త పుంతలు తొక్కబోతున్నాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నం వేదికగా జరిగిన గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర భవిష్యత్తుపై కీలక ప్రకటనలు చేశారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీపి కబురు అందిస్తూ, అమరావతి మరియు హైదరాబాద్ నగరాల మధ్య బుల్లెట్ రైలును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రెండు రాజధానుల మధ్య ప్రయాణ సమయం కేవలం 70 నిమిషాలకు తగ్గుతుందని, అలాగే చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లోనే చేరుకోవచ్చని ఆయన వివరించారు. ఇదే క్రమంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు మధ్య ప్రయాణ సమయం కూడా కేవలం 2 గంటల 08 నిమిషాలకు పరిమితం కానుందని తెలిపారు. రవాణా వ్యవస్థను మరింత

➤ మిగతా 2వ పేజిలో..

## జర్నలిస్టు దారుణ హత్య..

**వేట కొడవళ్ళతో స్వైర విహారం**

**చిత్తూరు జిల్లా వీ. కోట వద్ద సంఘటన**



**హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 28( జనసంఘర్షణ )**

చిత్తూరు జిల్లా ఉలిక్కిపడింది... అటవీ స్మగ్లర్ల వేట కొడవల్లతో స్వైర విహారంతో ఓ సీనియర్ జర్నలిస్టు దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనతో చిత్తూరు జిల్లా ఉలిక్కిపడింది. జిల్లాలో గతంలో ఇలాంటి దారుణ సంఘటనలు జరిగిన దాఖలాలు లేవు ... జర్నలిస్టు సంఘాలు ఉలిక్కిపడుతున్నాయి..? నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టులు ప్రాణాలు పోతున్నాయి...

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. స్థానికంగా పనిచేసే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో వేట కొడవల్లతో విరుచుకుపడిన కొందరు మనుషులు వేటాడి వేటాడి వేట కో డవల్లతో దారుణంగా హత్య చేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దీనికి కారణం స్థానిక స్మగ్లర్లే కారణమని పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఈ దారుణ హత్యను తెలుగు రాష్ట్రాల జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టి దేశానికి నాలుగు స్తంభమైన జర్నలిజం వ్యవస్థను రక్షించాలని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరుతున్నాం. తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగడాకుల బాలస్వామి జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి సాక్షి సీనియర్ జర్నలిస్టు చిలుకూరి అఖిలేష్ ఖండించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు

# నూతన డీజీపీగా సీవీఆనంద్

**మొదటిపేజీ తరువాయి..** ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న సీవీ ఆనంద్, తాజా నియామకంతో డీజీపీగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించనున్నారు. కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇటీవల యూపీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వానికి ముగ్గురు సీనియర్ అధికారుల పేర్లతో కూడిన జాబితాను పంపింది. అందులో 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌తో పాటు, 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే మరియు సౌమ్యా మిశ్రాల పేర్లు ఉన్నాయి. వీరిలో అత్యంత సీనియర్ కావడంతో పాటు సమర్థవంతమైన అధికారిగా పేరున్న సీవీ ఆనంద్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. ఏప్రిల్ నెలాఖరున ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి విధులకు స్వస్తి పలకనుండటంతో, అదే సమయంలో ఆనంద్ కొత్త బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని, ఆయన బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండే పూర్తిస్థాయి అధికారాలు బదిలీ అవుతాయని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## ఫ్యూచర్ కోసం..

**మొదటిపేజీ తరువాయి..** భూములిచ్చిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, వారి త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. హైదరాబాద్‌కు ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు ఒక పెద్ద ఆస్తి అని, మెట్రో విస్తరణ మరియు అత్యాధునిక కనెక్టివిటీతో నగరం మరింత అద్భుతంగా మారుతుందని వివరించారు. ముఖ్యంగా మూడు కోవిడ్ వ్యాక్సిన్ల ఉత్పత్తి మరియు యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లతో హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని గుర్తు చేశారు. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పుల గురించి ప్రస్తావిస్తూ, కేంద్రం ప్రకటించిన ఏడు బుల్లెట్ రైళ్లలో మూడు తెలంగాణకే రాబోతున్నాయని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ ఈ బుల్లెట్ రైళ్లు నడుస్తాయని, దీనికి తోడు అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్‌ను కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. మెట్రో, బుల్లెట్ ట్రైన్, బస్ టెర్మినల్ వంటివన్నీ ఒకే చోట అందుబాటులోకి రావడం వల్ల రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యంగా నిలుస్తుందని చెప్పారు. తనపై విమర్శలు చేసే వారి గురించి పట్టించుకోకుండా, ప్రజల అభివృద్ధి కోసమే నిరంతరం శ్రమిస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైలు..

**మొదటిపేజీ తరువాయి..** బలోపేతం చేసే దిశగా చెన్నై నుంచి కోల్‌కతా మధ్య ఉన్న రైల్వే లైన్లను నాలుగు వరుసలుగా విస్తరించే పనులను కేంద్రం చేపడుతోందని పేర్కొన్నారు. విశాఖపట్నం రైల్వే జోన్ గురించి ప్రస్తావిస్తూ, జూన్ 1వ తేదీ నుంచి ఈ జోన్‌ను నోటిఫై చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతను కొనియాడిన కేంద్ర మంత్రి, గతంలో ఆయన నిర్మించిన సైబరాబాద్ మరియు సైబర్ టవర్స్ ఐటీ రంగం పురోభివృద్ధిలో పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. చంద్రబాబును దేశం గర్వించదగ్గ 'విజనరీ లీడర్'గా అభివర్ణించడమే కాకుండా, ఆయన పనితీరుకు సెల్యూట్ చేస్తున్నానని ప్రకటించారు. చంద్రబాబు నాయకత్వంలో విశాఖపట్నం త్వరలోనే అత్యున్నత స్థాయి 'ఐటీ పట్నం'గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే యువనేత నారా లోకేష్ నాయకత్వ పటిమను, సమస్యల పరిష్కారంలో ఆయన చూపే చొరవను అభినందించిన మంత్రి, నేటి తరం నాయకులకు లోకేష్ ఒక ఆదర్శమని కొనియాడారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ మరియు సెమీకండక్టర్ల తయారీ రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తాయని, ఇందులో భారత్ కీలక పాత్ర పోషించబోతోందని అశ్విని వైష్ణవ్ వివరించారు. గూగుల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలు విశాఖకు రావడం శుభపరిణామమని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## నేడు టెన్త్ రిజల్ట్స్

**మొదటిపేజీ తరువాయి..** హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన వెంటనే జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను వేగవంతం చేసిన అధికారులు, ఈ నెల 23వ తేదీ నాటికే ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం మార్కుల నమోదు, సాంకేతిక పరిశీలన వంటి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి, ఏప్రిల్ 29నే ఫలితాలు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని, దీని కోసం పరీక్షల విభాగం తగిన సర్వర్ సామర్థ్యాన్ని కూడా పెంచినట్లు సమాచారం. అనుకున్న సమయం కంటే ముందే ఫలితాలు వస్తుండటంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులలో ఉత్కంఠ నెలకొంది.

## ఇంధన కొరతను ఖండించిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి..** వాస్తవమేనని, దీనివల్ల చమురు విక్రయ సంస్థలు ప్రతిరోజూ సుమారు 2,400 కోట్ల రూపాయల వరకు నష్టపోతున్నాయని అంచనాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రిటైల్ ధరలను పెంచే ఆలోచన లేదని కేంద్రం వివరించింది. ఈ అంశంపై పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ కీలక వివరణ ఇచ్చారు. ధరల పెరుగుదలపై వస్తున్న పుకార్ల వల్ల కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనతో ముందస్తుగా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారని (ప్యానిక్ బయింగ్), ఇది అనవసరమని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ మరియు ఎల్‌పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా సరఫరాకు అంతరాయం లేదని ఆమె హామీ ఇచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రిటైల్ అవుట్‌లెట్లలో నిరంతరం స్టాక్ అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఇంధన ధరలు నిలకడగా ఉన్నాయని, ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.

## మహిళా బిల్లును ఆమోదిస్తాం

**మొదటిపేజీ తరువాయి..** మండిపడ్డారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ వంటి విపక్షాలు తమ నీచ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు రాజకీయంగా ఎదగడం, వారు అసెంబ్లీలు మరియు పార్లమెంటులో అడుగుపెట్టడం విపక్షాలకు ఏమాత్రం ఇష్టం లేదని, అందుకే వారు తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రకరకాల సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఒక 'మహా యజ్ఞం'గా అభివర్ణించిన ప్రధాని మోదీ, ఈ పవిత్ర కార్యానికి మాతృమూర్తుల ఆశీస్సులు పొందేందుకే తాను వారణాసికి వచ్చానని భావోద్వేగంతో పలికారు. లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభలలో మహిళలకు సముచిత స్థానం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన మహిళలు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించాలని తాము ఆకాంక్షిస్తుంటే, ప్రతిపక్షాలు మాత్రం అధికారం కేవలం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని ఆటంకాలు సృష్టించినా మహిళా రిజర్వేషన్ల కోసం తమ పోరాటం ఆగదని, చట్టం అమలులోకి వచ్చే వరకు విశ్రమించబోమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా మహిళా లోకానికి హామీ ఇచ్చారు.

## ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

### 14మంది మహిళల దుర్మరణం

**జకార్తా న్యూఢిల్లీ, ఏప్రిల్28 :** ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు పక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

## కాలువలకు మరమ్మత్తులు

### తెలుగుగంగ ద్వారా కృష్ణాజలాలు నిలివివేత

**చిత్తూరు, ఏప్రిల్28 :** తెలుగు గంగ ప్రాజెక్టు కింద చెన్నైకి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణానది నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఏపీ సరిహద్దు ప్రాంతమైన కండలేరులో నిల్వవుంచుతారు. అక్కడి నుండి తెలుగుగంగ కాలువ ద్వారా తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ప్రస్తుతం కండలేరు-పూండి మధ్య తెలుగుగంగ ప్రాజెక్టులో ఏపీ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల కారణంగా కృష్ణాజలాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఈ నెలాఖరుకు పూర్తిచేశాక మే 1వ తేదీ నుంచి యథావిధిగా కృష్ణాజలాలను సరఫరా చేయనున్నట్లు ఏపీ అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ తెలిపింది. ఇదిలాఉండగా, నగరవాసులదాహార్తిని తీరుస్తున్న పూండి, చెంబరంబాక్కం, పుళల్, షోళవరం, కన్నన్‌కోట, తేర్వైకండిగై రిజర్వాయర్లలో ప్రస్తుతం 7,966 మిలియన్ ఘనపుటడుగుల నీటిని నిల్వవుంచినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు నిల్వవుంచిన నీటిమట్టం కంటే 36 మిలియన్ ఘనపుటడుగులు తక్కువని, ఈ వేసవి సీజన్‌లో తాగునీటి కొరత ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

## నేడు బెంగాల్ రెండో విడత ఎన్నికలు

**న్యూఢిల్లీ**

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో భాగంగా బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 294 నియోజకవర్గాలకు గాను, ఇప్పటికే మొదటి దశలో 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగియగా, మిగిలిన 142 స్థానాల్లో రేపు ఓటింగ్ జరగనుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, ఈ 142 నియోజకవర్గాల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 123 చోట్ల ఘనవిజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకోగా, భారతీయ జనతా పార్టీ 18 స్థానాల్లో, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒక చోట విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో రెండో దశ పోలింగ్ రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది.

ఎన్నికల వేళ రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించింది. పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నాటుబాంబులు లభ్యం కావడం, కొన్ని చోట్ల స్వల్ప పేలుడు సంఘటనలు చోటుచేసుకోవడం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. రాజకీయ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడానికి లేదా ఓటింగ్ సరళిని ప్రభావితం చేయడానికి దుండగులు పేలుడు పదార్థాలను ఉపయోగించే అవకాశం ఉందని భావించిన ఈసీ, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను అప్రమత్తం చేసింది. ఓటింగ్ రోజున మరియు ఆ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

ఇటీవల దక్షిణ పరగణాల జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఒక ఇంట్లో పెద్ద ఎత్తున నాటుబాంబులు పట్టుబడటంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్న కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఎన్ఐఏ రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేసింది. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్లు మరియు సిసిటివి కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఉగ్రవాద నిర్మూలనకు పోరాడాలి

**న్యూఢిల్లీ**

ప్రపంచ శాంతికి పెను సవాల్‌గా పరిణమించిన ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకోన్ముఖంగా పోరాడాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని, ఉగ్రవాదంపై భారత దృక్పథాన్ని బలంగా వినిపించారు. ప్రస్తుత కాలంలో ఉగ్రవాదమే అంతర్జాతీయ సమాజానికి ప్రధాన ముప్పుగా మారిందని, దీనివల్ల మానవాళి అనేక సమస్యలను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలను హెచ్చరించిన ఆయన, ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని స్పష్టం చేశారు.

గత ఏడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ, ఆ ఘటన యావత్ మానవాళిని కలిచివేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే ఆ దాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' ద్వారా ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వదిలిపెట్టబోమని నిరూపించామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పొరుగు దేశం పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, ప్రభుత్వ అండదండలతో సాగే సీమాంతర ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని ఆయన నొక్కి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, ఉగ్రవాదులకు సాయం చేసే శక్తులపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని పిలుపునిచ్చారు.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు మరియు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న సంక్షోభాల గురించి మాట్లాడుతూ.. ఘర్షణల వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు భారీ ఆస్తి నష్టం సంభవిస్తోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఉగ్రవాద బెదిరింపులనైనా ఎదుర్కొనేందుకు భారత్ సర్వసన్నద్ధంగా ఉందని స్పష్టం చేస్తూనే, ఉద్రిక్తతల పరిష్కారానికి ఎప్పుడూ దౌత్యపరమైన మార్గాలే సరైనవని ఆయన అభిప్రాయపడ్డారు. ఉగ్రవాద రహిత ప్రపంచం కోసం సభ్య దేశాలన్నీ సమష్టిగా బాధ్యత వహించాలని రాజ్‌నాథ్

# ఫీజుల వేటలో విద్యార్థి భవిష్యత్తు

**❑ కాసాని హరిప్రసాద్ ఆధ్వర్యంలో 'పోస్ట్ కార్డు' సమరం!**

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

తెలంగాణ విద్యా రంగం నేడు ఒక అంధకారంలో కూరుకుపోయింది. ఎన్నికల వేళ 'గ్రీన్ ఛానల్' ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి సర్కార్, అధికారంలోకి వచ్చి మూడేళ్లు సమీపిస్తున్నా ఆ దిశగా అడుగులు వేయకపోవడం గమనార్హం. దాదాపు రూ.8,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ సూచనలతో ఇల్లందు నియోజకవర్గంలో బీఆర్ఎస్వీ ఇంఛార్జ్ కాసాని హరిప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పోస్ట్ కార్డు ఉద్యమం' పాలకుల నిద్రమత్తు వదిలించేలా సాగింది. ఈ సందర్భంగా కాసాని హరిప్రసాద్ యాదవ్ గంభీరంగా మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న శీతకన్ను వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. "ప్రభుత్వానికి బడా కాంట్రాక్టర్లకు కమిషన్లు ఇచ్చేందుకు నిధులు ఉంటాయి కానీ, నిరుపేద విద్యార్థుల చదువుల కోసం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవా?" అని ఆయన ప్రశ్నించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి, కనీసం ఒక మంత్రిని కూడా నియమించకపోవడం విద్యా వ్యవస్థపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థులు సర్టిఫికెట్లు అందక, అటు ఉన్నత చదువులకు వెళ్లలేక, ఇటు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందు తపాలా కార్యాలయం వేదికగా రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తికి పోస్ట్ కార్డుల ద్వారా వినతులు పంపిన ఈ కార్యక్రమం ఒక సామాజిక చైతన్యాన్ని రగిలించింది. కాసాని హరిప్రసాద్ నేతృత్వంలో విద్యార్థి మరియు యువజన నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఈ ఉద్యమం కేవలం పోస్ట్ కార్డులకే పరిమితం కాదని, విద్యార్థుల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో ఉగ్రరూపం దాల్చుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సాగిన ఈ ప్రసంగం అక్కడ ఉన్న యువతలో ఆలోచనను, ఆవేశాన్ని నింపింది. చివరిగా విద్య అనేది ఒక హక్కు అని, అది




పాలకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకూడదని హరిప్రసాద్ యాదవ్ స్పష్టం చేశారు. ఒకవైపు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తుంటే, మరోవైపు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్ల సామాన్య విద్యార్థి నలిగిపోతున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కంటితుడుపు చర్యలు మానేసి, బకాయిలు చెల్లించి విద్యార్థుల సర్టిఫికెట్లు వారికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన నాయకులు నీలం రాజశేఖర్, నెమలి నిఖిల్, వాంకుడోత్ బిపిన్ నాయక్, గౌస్ పాషా తదితరులు పాల్గొని హరిప్రసాద్ యాదవ్ గారి పిలుపునకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# న్యాయమూర్తి కీర్తి చంద్రిక రెడ్డికి ఘన వీడ్కోలు





**❑ ఇల్లందు బార్ అసోసియేషన్ భావోద్వేగ సన్మానం!**

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

ఇల్లందు న్యాయస్థానంలో మూడేళ్ల పాటు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా న్యాయపాలన అందించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డికి ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అశ్రునయనాల మధ్య ఘనంగా వీడ్కోలు పలికారు. న్యాయవ్యవస్థలో విలువలను కాపాడుతూ, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో ఆమె చూపిన చొరవ అమోఘమని, ఆమె పదవీకాలం ఇల్లందు కోర్టు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్య రవికుమార్ నాయక్ కొనియాడారు. సన్మాన గ్రహీత కీర్తి చంద్రిక రెడ్డి స్పందిస్తూ.. "ఇల్లందు న్యాయవాదుల ప్రేమ, ఆదరణ వెలకట్టలేనివని, ఇక్కడ గడిపిన మూడేళ్లు ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చాయని" భావోద్వేగానికి లోనయ్యారు. బదిలీ అనేది వృత్తిలో భాగమని, తన తర్వాత వచ్చే వారికి కూడా ఇదే సహకారాన్ని అందించాలని ఆమె కోరారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ వేడుక కేవలం ఒక అధికారిక వీడ్కోలులా కాకుండా, ఒక కుటుంబం తన ఆత్మీయురాలిని సాగనంపుతున్నట్లుగా సాగడం అందరినీ ఆలోచింపజేసింది.

## భద్రాచలంలో ఇంధన సెగ: పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులు

భద్రాచలం ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

భద్రాచలం పట్టణంలో గత మూడు రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. బంకుల వద్ద "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన సీపీఐ(ఎం) పట్టణ కమిటీ నేడు స్థానిక అంబేద్కర్ సెంటర్లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. అనంతరం మండల తహశీల్దార్ ధనియాల వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించి, ఇంధన కొరతను వెంటనే నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. పాలకులు కొరత లేదని ప్రగల్భాలు పలుకుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉందని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ వాస్తవాలను పరిశీలించకుండా కొరత లేదని ప్రకటన చేయడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. పెట్రోల్ లేకపోతే బంకులు ఎందుకు మూతపడుతున్నాయని, వందలాది వాహనాలు క్యూలో ఎందుకు ఉంటున్నాయని వారు నిలదీశారు. ఇంధనంతో పాటు వంట గ్యాస్, డొమెస్టిక్ గ్యాస్ సరఫరా కూడా సక్రమంగా లేకపోవడంతో సామాన్యులు, హోటల్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ నిరసనలో







పార్టీ నాయకులు నాగరాజు, అజయ్ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యభిచార గృహాలపై టీం మెరుపు దాడి

బోధన్ ఏప్రిల్ 28జన సంఘర్షణ

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సిసి, ఎస్,ఏసీపీ ఇంచార్జ్ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో సి ఎస్ సిబ్బంది నేడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ ప్రియా నగర్ కాలనీలో వ్యభిచార గృహంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 6 మొబైల్ ఫోన్లు, 2 విటులు, 3 విటురాళ్లు, రూ.33,010 నగదు స్వాధీనం చేసుకొని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.



## తుజాల్‌పూర్ గ్రామంలో భూభారతి భూసర్వే రీసర్వే అవగాహన సదస్సు

కామారెడ్డి బీబీపేట్ ఏప్రిల్ 28 ( జన సంఘర్షణ )




బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో మంగళవారం రోజున భూభారతి భూసర్వే రిసర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, భూ సంబంధిత అంశాలు, ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్, మండల రెవిన్యూ అధికారి గంగ సాగర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ తలారి ప్రవిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ రంగయ్య గారి లక్ష్మారెడ్డి , వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 28( జనసంఘర్షణ )



జవహర్ నగర్, టీఆర్‌టి లోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారికి 1.35 కిలోల వెండి కవచాన్ని దాతలు లక్ష్మా రెడ్డి అందచేసారు. వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ఎ.వినయ్ కుమార్ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్,ఆనంద్ రావు, సాయి కుమార్, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, స్థానికులు శ్రీనివాస్ యాదవ్, కార్యక్రమ నిర్వాహకులు ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్ రావు సంజీవ రావు, హరింధర్ రెడ్డి, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో 'హిందూ సమ్మేళనం' శంఖారావం.. కరపత్రాల ఆవిష్కరణ!

భద్రాచలం ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)



భద్రాచలం పట్టణ ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నేడు హిందూ సమ్మేళనం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. మే 3వ తేదీ ఆదివారం భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.హిందూ సమాజంలో ఐక్యత, ధార్మిక విలువల రక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. నేటి కరపత్రాల విడుదల ద్వారా ప్రచారాన్ని గ్రామాలు, వార్డు స్థాయికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎం.వి. సుబ్రహ్మణ్యం, నాగభూషణ శాస్త్రి, గోపి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతే రాజు.. పాలకుల బాధ్యత అదే

**❑ సుజాతనగర్‌లో కూనంనేని సాంబశివరావు ధ్వజం!**

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)




రైతు సంక్షేమమే ధ్యేయంగా, అన్నదాత పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. సుజాతనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, రబీ సీజన్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కేవలం కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా, తూకంలో తేడాలు లేకుండా, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షాబీర్ పాషాతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో, రాజకీయాలకు అతీతంగా రైతుల గొంతుకగా నిలబడతామని ఆయన హామీ ఇచ్చారు. పండించిన పంటను అమ్ముకోవడానికి రైతు కన్నీరు పెట్టే పరిస్థితి రాకూడదని, అప్పుడే నిజమైన వ్యవసాయాభివృద్ధి సాధ్యమని ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడ ఉన్న రైతాంగాన్ని ఆలోచింపజేశాయి.

## మహనీయుడికి దక్కిన గౌరవం: అంబేద్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీల తొలగింపు!

కొత్తగూడెం ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు, తోరణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు నేడు తొలగించారు. అడ్వకేట్ మారపాక రమేష్ కుమార్ నిన్నటి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా యంత్రాంగం ఈ తక్షణ చర్యలు చేపట్టింది. గత కొంతకాలంగా రాజకీయ బ్యానర్లతో విగ్రహం కనుమరుగై, మహనీయుడి గౌరవానికి భంగం కలుగుతోందని రమేష్ కుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్, ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో వన్ టౌన్ సిఐ కరుణాకర్ నేతృత్వంలో క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. భవిష్యత్తులో విగ్రహం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్ణయం పట్ల సామాజిక కార్యకర్తలు ఆశన్న, చదలవాడ సూరి తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
బుధవారం
29 ఏప్రిల్ 2026

# నిస్వార్ధ గళానికి 'దళిత రత్న' గౌరవం

❑ **జర్నలిస్ట్ నిట్ట సుదర్శన్‌కు అరుదైన పురస్కారం**

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

సామాజిక అన్యాయాలపై తన కలంతో నిరంతరం యుద్ధం చేస్తున్న దళిత జర్నలిస్ట్ నిట్ట సుదర్శన్ 'దళిత రత్న' అవార్డును అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత 12 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచార నిరోధక చట్టం అమలులో జరుగుతున్న లోపాలపై నిట్ట సుదర్శన్ రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఆయన జర్నలిజాన్ని కేవలం వృత్తిగా కాకుండా, అణగారిన వర్గాల గొంతుకగా మార్చుకున్న తీరును ప్రభుత్వం గుర్తించింది. 2026 డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మాల సంక్షేమ సంఘం సిఫారసు మేరకు ఈ అవార్డును అందజేశారు. బాధితుల పక్షాన నిలబడి ప్రాణాపాయ స్థితిలో కూడా న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం ఈ అవార్డుకు వన్నె తెచ్చింది. చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, బాధితులకు అండగా ఉంటూ కమిషన్ దృష్టికి సమస్యలను తీసుకురావడంలో సుదర్శన్ కృషి అభినందనీయమని, ఈ పురస్కారంతో ఆయనపై బాధ్యత మరింత పెరిగిందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



**కలం పట్టిన పోరాట యోధుడు**

జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం మాత్రమే కాదు, బాధితుల పక్షాన నిలబడి వ్యవస్థను ప్రశ్నించడమని నిరూపించారు నిట్ట సుదర్శన్. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గత పుష్కర కాలంగా దళిత, గిరిజన సామాజిక వర్గాలకు ఎదురవుతున్న అన్యాయాలపై ఆయన తన కలం ద్వారా నిరంతర పోరాటం సాగిస్తున్నారు. అట్రాసిటీ చట్టం నీరుగారిపోతున్న వేళ, బాధితులకు చట్టబద్ధమైన న్యాయం అందేలా చేయడంలో ఆయన చూపిన చొరవ నేడు ఆయనను 'దళిత రత్న'గా నిలబెట్టింది.



**ప్రభుత్వ గుర్తింపు - స్ఫూర్తిదాయక ప్రయాణం**

హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన వేడుకలో, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య చేతుల మీదుగా సుదర్శన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. 2026 అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఒక దళిత జర్నలిస్టు కృషిని గుర్తించడం సామాజిక స్పృహ కలిగిన జర్నలిజానికి దక్కిన గౌరవంగా భావించవచ్చు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్ సహా పలు సంఘాల నేతలు పాల్గొని ఆయనను అభినందించారు.

**అన్యాయంపై అలుపెరగని యుద్ధం**

అవార్డు గ్రహీత నిట్ట సుదర్శన్ ప్రయాణం పూల బాట కాదు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను ఎండగట్టినందుకు, బాధితులకు అండగా నిలిచినందుకు ఆయన ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో హత్యాయత్నం దాడులకు గురైనా వెనకడుగు వేయకుండా, బాధితుడిగా ఉంటూనే మరోవైపు న్యాయం కోసం న్యాయస్థానాల వరకు పోరాడారు. ఈ నిస్వార్థ జర్నలిజమే ఆయనను నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యేలా చేసింది.

**అంబేద్కర్ వారసుడిగా బాధ్యత**

పురస్కారం స్వీకరించిన అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని, తన చివరి శ్వాస వరకు బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన వర్గాల సంక్షేమం కోసం పని చేస్తానని ప్రకటించారు. బాధితుల పక్షాన నిలబడటమే తన ప్రాథమిక విధి అని, తన కలం ఎప్పుడూ న్యాయం కోసమే స్పందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. తనకు సహకరించిన మాల సంక్షేమ సంఘం నేతలకు, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కొత్తగూడెం రైల్వే అభివృద్ధికి వై. శ్రీనివాస్ రెడ్డి భరోసా

❑ **త్వరలోనే ప్రయాణికుల కష్టాలకు చెక్!**

కొత్తగూడెం ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

కొత్తగూడెం రైల్వే స్టేషన్ ముఖచిత్రాన్ని మార్చేందుకు, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి నడుం బిగించారు. మంగళవారం సికింద్రాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారుల నుంచి సానుకూల హామీలు పొందారు.

రైళ్ల పునరుద్ధరణపై ఆశలు: మణుగూరు-కాజీపేట ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్‌లను తిరిగి ప్రారంభించే దిశగా శ్రీనివాస్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి అధికారులు సానుకూలంగా స్పందించారు.






స్టేషన్ ఆధునీకరణ: నత్తనడకన సాగుతున్న కొత్తగూడెం స్టేషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ఆధునిక హంగులతో ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని అధికారులు వెల్లడించారు.

వృద్ధులకు ఊరట: సూపర్ ఫాస్ట్ రైళ్లను ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ మీదే ఆపడం ద్వారా మహిళలు, వృద్ధుల ఇబ్బందులను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరగా, సావధానంగా పరిష్కరిస్తామని డివిజనల్ మేనేజర్ హామీ ఇచ్చారు.

రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్: ఎంపీ రఘురాం రెడ్డి ప్రతిపాదించిన త్రీ టౌన్ రోడ్డు వెడల్పు కోసం రైల్వే స్థలం క్లియరెన్స్‌పై ముందడుగు పడింది.

కొత్తగూడెం రైల్వే ప్రయాణికుల చిరకాల స్వప్నమైన తిరుపతి ప్రత్యేక రైలు సహా ఇతర సమస్యలను ఒకదాని వెనుక ఒకటి పరిష్కరిస్తామని అధికారులు స్పష్టం చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# బ్లాక్ మార్కెట్ దందాలపై ఖాకీ నిఘా

❑ **కృత్రిమ కొరత సృష్టిస్తే కటకటాలే!**



కొత్తగూడెం ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరతను సాకుగా చూపుతూ అక్రమ సంపాదనకు తెరలేపిన బ్లాక్ మార్కెట్ కేటుగాళ్లపై భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం ఉక్కుపాదం మోపారు. సామాన్యుడి అవసరాన్ని ఆసరాగా చేసుకుని, అధిక ధరలకు విక్రయించాలనే దురుద్దేశంతో ఇంధనాన్ని నిల్వ చేస్తూ కృత్రిమ కొరత సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా విభాగాలను రంగంలోకి దించినట్లు ఆయన తీవ్రంగా హెచ్చరించారు. బంకుల వద్ద బారులు తీరిన జనాన్ని చూసి ఆందోళన చెందవద్దని, సంయమనం పాటిస్తూ కేవలం అవసరమైన మేరకే ఇంధనం కొనుగోలు చేయాలని కోరుతూనే, నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వ్యవస్థలోని లోపాలను సొమ్ము చేసుకునే స్వార్థపరుల ఆటలు సాగనివ్వబోమని, ప్రజల ఇబ్బందులతో వ్యాపారం చేసే ధోరణిని సహించేది లేదని ఎస్పీ ఈ సందర్భంగా తేల్చిచెప్పారు.

# మణుగూరులో గంజాయి కలకలం: ఒకరి అరెస్ట్

మణుగూరు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)




మండలంలోని న్యూ పద్మ గూడెం గ్రామంలో గంజాయి విక్రయి స్తున్న మిడియం గోవిం దును పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, 1.085 కేజీల గంజా యిని స్వా ధీనం చేసుకున్నారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదేశాలతో సిఐ నాగబాబు బృందం ఈ దాడులు నిర్వహించింది.పక్కా సమాచారంతో పోలీసులు పద్మగూడెంలోని ఓ ఇంట్లో సోదాలు చేపట్టారు.గుట్ట సాయి వద్ద గంజాయి కొని, సత్తుపల్లికి చెందిన సందీప్‌కు అమ్ముతున్నట్లు నిందితుడు అంగీకరించాడు.ఈ ముఠాలోని గోవిందు, గుట్ట సాయి, సందీప్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.పట్టుబడ్డ నిందితుడు గోవిందును జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సిఐ నాగబాబు వెల్లడించారు.

## ఉపాధికి 'కొలువుదీపం'.. సాంకేతిక విద్యకు మళ్లీ పెరిగిన క్రేజ్!

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాలిటెక్నిక్ విద్య మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక రంగానికి డిమాండ్ పెరగడం, ఇంటర్మీడియట్‌తో పోలిస్తే త్వరగా స్థిరపడే అవకాశం ఉండటంతో విద్యార్థులు సాంకేతిక విద్య వైపు మొగ్గు చూపుతున్నారు. కేవలం మూడేళ్ల కోర్సుతోనే ఇంజనీరింగ్ నైపుణ్యాలను అందిపుచ్చుకుని, పరిశ్రమల్లో నేరుగా ఉపాధి పొందే అవకాశం ఉండటమే ఈ ఆదరణకు ప్రధాన కారణమని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు. జిల్లాలోని రెండు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రస్తుతం దాదాపు 1500 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. గతంలో మెకానికల్, సివిల్ వంటి సంప్రదాయ కోర్సులకు మాత్రమే పరిమితమైన విద్యార్థులు, ఇప్పుడు నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఈవీ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల రంగం విస్తరిస్తుండటంతో ఈవీ కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉంటున్నాయి. తక్కువ ఖర్చుతో సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించి, మధ్యతరగతి విద్యార్థులకు భవిష్యత్తుపై భరోసా కల్పిస్తుండటంతో తల్లిదండ్రులు కూడా ఈ కోర్సులనే ఎంచుకుంటున్నారు. జిల్లాలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంలో పాలిటెక్నిక్ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పవచ్చు.

## కేంద్రం వైఫల్యంపై సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ సమరభేరి

❑ **కొమరారంలో ఇంధన సెగ!**




ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

కొమరారం: దేశంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని నిరసిస్తూ నేడు కొమరారం పెట్రోల్ బంక్ వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఇంధనం దొరక్క రవాణా, వ్యవసాయ పనులు నిలిచిపోవడంతో పార్టీ శ్రేణులు రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. వరి కోత యంత్రాలు, ట్రాక్టర్లకు డీజిల్ అందకపోవడంతో కోతలు ఆగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నేత పొడుగు నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. బంకుల్లో స్టాక్ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని లీటర్ రూ.300 కు అమ్ముతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే ఇంధన సరఫరాను పునరుద్ధరించి సామాన్యులను, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు మూడు మాలు, జోగా కృష్ణ, మోతిలాల్ తదితరులు పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## విహెచ్‌పి కార్యకర్తలకు యోగా శిక్షణ.. శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్న యువత!

పాల్వంచ ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)



స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల శిక్షణ శిబిరంలో భాగంగా, మంగళవారం కార్యకర్తలకు ప్రముఖ యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ ప్రత్యేక యోగా శిక్షణ ఇచ్చారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విహెచ్‌పి మాజీ సహ కార్యదర్శి, ప్రముఖ యోగా గురువు సత్యనారాయణ గారు శిక్షార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. కార్యకర్తలలో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత పెంపొందించడమే లక్ష్యంగా ఈ శిబిరం కొనసాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న విహెచ్‌పి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై యోగా మెళకువలు నేర్చుకున్నారు.

## కేటీఆర్‌నీ కలిసిన ముషీరాబాద్ ఏంఎల్‌ఏ ముఠా గోపాల్

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 28( జనసంఘర్షణ )



టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సీ కేటీఆర్‌ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ముషీరాబాద్ శాసనసభ్యులు శ్రీ ముఠాగోపాల్, డివిజన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు.

## ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

❑ **పాల్గొన్న మంత్రులు.. డిజిపి శివధర్ రెడ్డి**



హైదరాబాద్/ ఏప్రిల్ 28/(జన సంఘర్షణ)

ఫ్యూచర్ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య సహచర మంత్రులు, డిజిపి శివధర్ రెడ్డి తో కలిసి ఈ ఫీచర్స్ సిటీ కమిషనరేట్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు , జూపల్లి కృష్ణారావు. సిటీ కమిషనర్ సుదీర్ బాబు పాల్గొన్నారు

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


## మాజీ మంత్రి జీవన్ రెడ్డికి స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి, ఏప్రిల్ -28(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మండలం హల్మాజీపూర్ గ్రామానికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జీవన్ రెడ్డి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వీచ్చేయగా ఆయనను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హల్మాజీపూర్ గ్రామానికి చెందిన తన బంధువు సుభాష్ రెడ్డి ఇంటిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ కి జీవన్ రెడ్డి హాజరయ్యారు. దీంతో ఇటీవల కాంగ్రెస్ పార్టీ ని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత మొదటిసారి నియోజకవర్గానికి రావడంతో ఆయనను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శాలువాతో సన్మానించి, పూల బొక్కే అందజేసి ఘనంగా సన్మానించారు. సౌమ్యులు, రాజకీయంగా విశేష అనుభవం కలిగిన జీవన్ రెడ్డి బిఆర్ఎస్ లో చేరడం పార్టీకి శుభపరిణామమని, రాష్ట్రంలో బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆశభావం వ్యక్తం చేశారు అనంతరం... మాజీ మంత్రిని మండల బిఆర్ఎస్ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆదిమూలం సతీష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏగుల నర్సింలు, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, గోపాల్ పేట్ సర్పంచ్ వంశీ, గంగారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు శాలువాలతో సన్మానించారు.

## కొత్తపల్లిలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవా వేడుకలు..

కోటగిరి ఏప్రిల్28/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా కోటగిరి, మండలపరిధిలోని కొత్తపల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహం వద్ద పంచశీల ప్రార్ధన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసినాడు అని కొనియాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉండాలని ఆయన ప్రతిపాదన చేశారు. ఓటు హక్కు ఎవరికి ఉండాలని ఉద్దేశంతో, లాల్ బహదూర్ శాస్త్రి భూస్వాములకే ఓటు హక్కు ఇవ్వాలని ప్రతిపాదించారు. మహాత్మా గాంధీ డిగ్రీ పట్టా పొందిన వారికి మాత్రమే ఓటు హక్కును కల్పించాలన్నరు. కాని బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్కడే అన్ని వర్గాల స్రి, పురుషులకు 18 సం”లు నిండిన వారికిఓటు హక్కు ఉండాలని ప్రతిపాదించాడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగను రచయితగా రెండు సంవత్సరాల 18 నెలల 18 రోజులలో రాజ్యాంగాన్ని రాసి రాజ్యాంగ అధ్యక్షుడిగా ఉన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి, జవహర్లాల్ నెహ్రూ లకు అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని అందజేశారు. 18 సంవత్సరాలు ఓటు హక్కును కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రధానమంత్రి కావాలంటే ఈ ఓటు హక్కు ద్వారానే ఎన్నుకోవాల్సి వస్తుందని అన్నారు గ్రామంలో సర్పంచ్ జిల్లా పరిషత్ అధ్యక్షులు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కావాలంటే ఈ ఓటు హక్కు ద్వారానే ఎన్నుకొనబడతారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పుప్పల గంగారం, కమిటీ అధ్యక్షులు గంగారం, ఉపాధ్యక్షులు పోచయ్య, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్,కార్యవర్గ సభ్యులు రాము, సాయిబాబు,స్థానిక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు ఈనాడు సాయిలు,పుప్పాల సైదయ్య, సాయి,శివశంకర్,పుప్పాల రవి, మహిళలు, యువకులు పాల్గొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి ర్యాలీతో ఊరేగింపుగా శోభయాత్రగా వెళ్లి విజయవంతం చేసినారు.

## నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభం



పోతంగల్../.. ఏప్రిల్28../(జన సంఘర్షణ)

పోతంగల్ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యాలయం మంగళవారం ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పోతంగల్ తాసిల్దార్ విష్ణు, కోటగిరి ఎస్సై సునీల్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, అధికారులు మాట్లాడుతూ, ప్రపంచంలో ఏ చోట ఏం జరిగినా క్షణాల్లో మీడియా ద్వారా తెలుస్తుందన్నారు. జర్నలిస్టులు వార్తలు అతి తొందరగా ప్రజలకు చేరడం మీడియా పాత్ర కీలకమైంది. అలాంటి మీడియాను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. గతంలో వార్త పత్రిక రావాలంటే ఒకరోజు పడుతుందన్నారు. కానీ ఇప్పుడు పాత్రికేయ మిత్రులు అందుతున్నాయని అభినందించారు. ప్రెస్ క్లబ్ సేవలు అద్భుతం అని ఆడారు, జర్నలిస్టులు విలువలు కాపాడుతూ– ప్రజలకు మీ యొక్క విలువైన సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో, కోటగిరి ఎస్సై సునీల్, పోతంగల్ మండల తాసిల్దార్ విష్ణు, సామాజిక కార్యకర్త ఎం ఏ హకీం, ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ, బాల్ ఠాక్రే, పోతంగల్ మండల స్థానిక సర్పంచ్, సంధ్యా హనుమాన్లు, రిటైర్డ్ టీచర్ నాగయ్య, జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి పోచిరాం , నాయకులు , పబ్బా శేఖర్, నాగం సాయిలు, సునీల్, ఫిరోజ్, బజరంగ్, మాజీ ఎంపీటీసీ గంగాధర్ , కోటగిరి మండల బిజెపి అధ్యక్షుడు, వేముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షుడు, హరికృష్ణ ,పోతంగల్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అర్జున్, ఉపాధ్యక్షులు గంధపు దత్తు, ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్, కార్యదర్శి విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి, యాదవ్, కోశాధికారి, లక్ష్మణ్, గౌరవ సలహాదారులు, గణేష్, శ్రీనివాస్, పాకల గజేందర్, కార్యవర్గం సభ్యులు, భీమ్రావు, రాజేష్, శ్రీకాంత్, అజారుద్దీన్, సద్దామ్, మండలంలోని వివిధ శాఖల అధికారులు , ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ‘ఉత్తమ పీఎల్వీ’ సతీష్ ఖండేల్వాల్ హర్షం

- పాఠశాలల్లో న్యాయ విద్య

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం, న్యాయ సేవాధికార సంస్థ చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రాష్ట్ర ఉత్తమ పారా లీగల్ వాలంటీర్ (ఖాం) సతీష్ ఖండేల్వాల్ అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు వారి హక్కులు, రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ మరియు స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మధ్య కుదిరిన ఒప్పందం భవిష్యత్తు తరాలకు దిశానిర్దేశం చేస్తుందని ఆయన కొనియాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో లీగల్ లిటరసీ క్లబ్బులు, చైల్డ్ రైట్స్ క్లబ్బుల ఏర్పాటు ద్వారా బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధం, ప్రాథమిక విధులపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారని సతీష్ ఖండేల్వాల్ వెల్లడించారు. ఈ వినూత్న కార్యక్రమం వల్ల బాలికలపై జరుగుతున్న అన్యాయాలు తగ్గుతాయని, విద్యార్థులు చట్టపరమైన విజ్ఞానంతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ విద్యను పాఠశాల స్థాయి నుంచే ప్రవేశపెట్టడం సామాజిక మార్పుకు నాంది అని ఆయన పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తారని సతీష్ ఖండేల్వాల్ స్పష్టం చేశారు. పాఠశాలలకు నేరుగా వెళ్లి విద్యార్థులతో మమేకమవుతూ అవగాహన సదస్సులు నిర్వహించేందుకు తమకు అవకాశం కల్పించిన రాష్ట్ర విద్యాశాఖ మరియు న్యాయ సేవాధికార సంస్థ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం చేకూరాలంటే ఇలాంటి విద్యా విధానం ఎంతో



అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## అధికారుల నిర్లక్ష్యంపై ‘కోర్లపాటి’ గర్జన!

- అధికారుల ఉదాసీనతపై ‘కోర్లపాటి’ నిప్పులు: ఇల్లందు మున్సిపల్ సభలో ప్రజా గళం!

ఇల్లందు ఏప్రిల్ 28 (జన సంఘర్షణ)

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం అధికారుల వైఫల్యాలను ఎండగట్టిన వేదికగా నిలిచింది. ముఖ్యంగా 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివకిరణ్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న జ్వలంత సమస్యలపై అధికారులను నిలదీశారు. గత ఏడాది కాలంలో మరణించిన ఐదుగురు మున్సిపల్ కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు నేటికీ చెల్లించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. “చనిపోయిన కార్మికుల కుటుంబాలు కన్నీరు మున్నీరవుతుంటే, అధికారులు ఫైళ్లతో కాలక్షేపం చేయడం ఎంతవరకు సమంజసం?” అని ఆయన సంధించిన పదునైన ప్రశ్నలు సభలో చర్చనీయాంశమయ్యాయి. బాధితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమంతో పాటు మున్సిపల్ ఆదాయ మార్గాలపై శివకిరణ్ చేసిన విశ్లేషణ అధికారుల బాధ్యతారాహిత్యాన్ని బయటపెట్టింది. పట్టణంలో 105 మంది కార్మికుల పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంపై ఆయన మండిపడ్డారు. అలాగే, గత రెండేళ్లుగా సాగుతున్న ఇంటి పన్ను సర్వేలో దాదాపు




60 శాతం లోపాలు ఉన్నాయంటే అది అధికారుల వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. ఈ లోపాలను వెంటనే సరిదిద్ది, పన్నుల వసూళ్లను క్రమబద్ధీకరించడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన హితవు పలికారు. అక్రమ పంపు కనెక్షన్ల విషయంలో జాప్యాన్ని వీడి, వాటిని సక్రమంగా మార్చి నీటి సరఫరా మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా 19 నుంచి 24 వార్డుల పరిధిలో వేసవి కాలంలో తలెత్తే నీటి ఎద్దడిపై శివకిరణ్ గళమెత్తారు. 22వ వార్డులో ప్రత్యేకంగా నీటి ట్యాంకు నిర్మించినప్పటికీ, సరైన పంపిణీ వ్యవస్థ లేక మహిళలు బిందెలతో రోడ్లపైకి రావాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “కోట్లు ఖర్చు చేసి ట్యాంకులు కడితే సరిపోదు, ప్రజల గొంతు తడిపినప్పుడే ఆ నిధులకు సార్థకత ఉంటుంది” అని ఆయన వ్యాఖ్యానించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మొత్తం సమావేశంలో కోర్లపాటి శివకిరణ్ లేవనెత్తిన అంశాలు మున్సిపల్ యంత్రాంగాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. సామాన్య కార్మికుడి కష్టాల నుంచి మొదలుకొని, పట్టణ అభివృద్ధి వరకు ఆయన చేసిన సూచనలు అధికారులకు కనువిప్పు కలిగించేలా ఉన్నాయి. కేవలం లెక్కలు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో మార్పులు తీసుకురావాలని ఆయన గట్టిగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, మేనేజర్ అంకుష్ షావలితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శివకిరణ్ లేవనెత్తిన ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతారో లేదో వేచి చూడాలి.

## చెడు అలవాట్లతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

- యువతకు పిలుపునిచ్చిన ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి
- ముగిసిన నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రీమియర్ లీగ్ పోటీలు

బోధన్: ఏప్రిల్ 28 జన సంఘర్షణ

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, విద్యపై దృష్టి సారించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఏప్రిల్ 20 నుండి 28 వరకు జరగగా, ఇందులో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్బాల్, యోగా వంటి విభిన్న క్రీడలు నిర్వహించారు. మంగళవారం ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమం ఉమెన్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. యువతకు నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్, క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నగరంలో పెరుగుతున్న చెడు అలవాట్లు, ముఖ్యంగా రాత్రి సమయంలో జరిగే బెట్టింగ్ కార్యకలాపాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మంచి భవిష్యత్తు కోసం లక్ష్యంతో ముందుకు సాగాలని, తప్పుదారులు పట్టకూడదని యువకులకు సూచించారు. యువత జీవిత నిర్మాణ దశలో ఉన్నందున చెడు అలవాట్లకు లోనైతే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. క్రీడలు, విద్య, మంచి ఆలోచనలతో జీవితాన్ని సానుకూల దిశలో తీర్చిదిద్దుకోవాలని సూచించారు. నగరంలో రాత్రి 11:30 తర్వాత జరుగుతున్న బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో పోలీస్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ యువత చదువులతోపాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు తమ కాలేజీ సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడల ద్వారా శారీరక సామర్థ్యం, మానసిక తేజస్సు, ఉత్సాహం మరియు సామాజిక చైతన్యం పెంపొందించుకోవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలు, టూరిజం రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నిజామాబాద్ జిల్లాలో రన్నింగ్ ట్రాక్స్, వాకింగ్ ట్రాక్స్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం క్రీడారంగానికి భారీగా నిధులు కేటాయించిందన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. తాను కూడా క్రీడల వల్లనే ఐపీఎస్ ఇంటర్వ్యూలో విజయాన్ని సాధించానని చెప్పారు. యువత మొబైల్ వ్యసనం, మత్తు పానీయాల నుండి దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఏప్రిల్ 20 నుండి 28 వరకు జరిగాయని, ఇందులో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్బాల్, యోగా వంటి విభిన్న క్రీడలు నిర్వహించడం విశేషమన్నారు. ఉమెన్స్ కళాశాల మైదానంలో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ‘సే నో టు డ్రగ్స్ – సే యెస్ టు స్పోర్ట్స్” అనే నినాదంతో యువత ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ శ్రీ శుభం ప్రకాష్ , రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి , నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నుడా చైర్మన్ కేశ వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, నిజామాబాద్ , ఆర్మూర్, బోధన్ , ట్రాఫిక్, సిటిసిఎసిపి లు సిఐలు ఎస్సైలు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్ రెడ్డి, కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, అడ్వకేట్ రాజేందర్రెడ్డి, ఎన్ ఎస్ సి నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కవిత రెడ్డి, కోశాధికారి సంతోష్ కుమార్, సంయుక్త కార్యదర్శులు రజనీకాంత్, శిరీష్, శ్రీనివాస్ రె డ్డి, డాక్టర్ ఉష, డివైఎస్ వో పవన్ కుమార్, మల్లేష్ గౌడ్, మీసాల





ప్రశాంత్, అజ్మత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వివరాలు :

క్రికెట్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ది సిరీస్..దీపక్ కు. బెస్ట్ బ్యాట్స్మెన్ 36 బంతుల్లో 102 మాజీద్ లకు నగదు తో పాటు మిమ్మల్ని టూర్ అందజేశారు. బాస్కెట్బాల్ పోటీలో మొదటి స్థానం ప్రొడెన్సీ ఎన్ బి ఏ , ద్వితీయ స్థానం కాకతీయ ఎన్ బి తృతీయ స్థానం ఎన్ వి ఏ 3. కబడ్డీ మొదటి స్థానం రెంజల్ ప్రొడెన్సీ జట్టు, ద్వితీయ స్థానం అమ్రాద్, తృతీయ స్థానం ముషీర్ నగర్ ( నవ్య భారతి జట్టు). క్రికెట్ విక్కీ లెవెన్ సుభాష్ గార్డెన్ జట్టు , ద్వితీయ స్థానం కాకతీయ జట్టు. వాలీబాల్ లో కమ్మర్పల్లి జట్టు, , ద్వితీయ స్థానంలో కొండాపూర్, తృతీయస్థానం పడకల్ క్రికెట్ లో మొదటి స్థానం 1,00,000/- , ద్వితీయ స్థానానికి 50,000/- వాలీబాల్ కబడ్డీ భాస్కర్ బాల్ మొదటి స్థానం 20,000/- ద్వితీయ స్థానం 10,000/- స్థానం 5000/- నగదును అందజేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
29 ఏప్రిల్ 2026

# జర్నలిస్టు దారుణ హత్య.....వేట కొడవళ్ళతో స్వైర విహారం

◆ **చిత్తూరు జిల్లా వీ. కోట వద్ద సంఘటన ....**

హైదరాబాద్ సిటీబ్యూరో /ఏప్రిల్ 28( జనసంఘర్షణ )

చిత్తూరు జిల్లా ఉలిక్కిపడింది... అటవీ స్మగ్లర్ల వేట కొడవల్లతో స్వైర విహారంతో ఓ సీనియర్ జర్నలిస్టు దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనతో చిత్తూరు జిల్లా ఉలిక్కిపడింది. జిల్లాలో గతంలో ఇలాంటి దారుణ సంఘటనలు జరిగిన దాఖలాలు లేవు ... జర్నలిస్టు సంఘాలు ఉలిక్కిపడుతున్నాయి..? నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టులు ప్రాణాలు పోతున్నాయి...చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. స్థానికంగా పనిచేసే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో వేట కొడవళ్లతో విరుచుకుపడిన కొందరు మనుషులు వేటాడి వేటాడి వేట కోడవల్లతో దారుణంగా హత్య చేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దీనికి కారణం స్థానిక స్మగ్లర్లే కారణమని పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఈ దారుణ హత్యను తెలుగు రాష్ట్రాల జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టి దేశానికి నాలుగు స్తంభమైన జర్నలిజం వ్యవస్థను రక్షించాలని ప్రతి ఒక్కరూ



ముక్తకంఠంతో ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరుతున్నాం. తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగడాకుల బాలస్వామి జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి సాక్షి సీనియర్ జర్నలిస్టు చిలుకూరి అఖిలేష్ ఖండించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

# వివాహేతర సంబంధం... ఇద్దరి ప్రాణాలు తీసింది

◆ **నిజామాబాద్ జిల్లాలో ఘటన**

నిజామాబాద్/ఏప్రిల్ 28/(జన సంఘర్షణ)

వివాహేతర సంబంధాలు పచ్చని కుటుంబాలను చిన్న భిన్నం చేస్తున్నాయి. వాళ్ల సంతోషం కోసం పిల్లల్ని, తల్లిదండ్రులని చివరికి కట్టుకున్న భార్య భర్తలను దూరం చేస్తున్నాయి. ఫలితం ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇలాంటి ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది . మామిడిపల్లి తాండకు చెందిన ఆనంద్. వర్ని మండలం పొట్టి గుట్ట తాండకు చెందిన సుజ్జి బాయి తో ఆనంద్ గత కొన్ని నెలలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. మంగళవారం పొట్టి గుట్ట తండాలో సుజీ బాయి ఇంటి వద్ద ఆనంద్ కు సుజ్జి బాయ్ తో మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఆనంద్ ఆవేశం పెంచుకొని పదునైన వ్యవసాయ పనిముట్టుతో సుజ్జి





బాయ్ పై దాడి చేయగా తీవ్ర గాయాలకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తెలుసుకున్న ఆనంద్ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా మృతురాలి కుటుంబ సభ్యులు ఆనంద్ ను వెంబడిస్తూ రాళ్లతో కొట్టగా తీవ్ర గాయాల గురై పొలంలో అపస్మార్క స్థితిలో పడి ఉండగా, వర్ని ఎస్సై పరిశీలించి ఆనంద్ బతికి ఉన్నాడని పొతంగల్ 108 అంబులెన్స్ కు ఫోన్ చేయగా వాళ్ళు తక్షణం సంఘటన స్థలానికి చేరుకొని ఆనంద్ ను నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆసుపత్రి వద్దకు రాగానే మృతి చెందాడు. ఇద్దరూ మృతి చెందడం పట్ల వర్ని పోలీసులు అసలు వీరిద్దరి మధ్య సంబంధం ఏంటి? ఘర్షణకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

# పోతంగల్ తహసిల్దార్‌ను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

పొతంగల్/ఏప్రిల్ 28/ (జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలనికి నూతనంగా వచ్చిన తహసిల్దార్ విష్ణును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం ఆయనతో పార్టీ నాయకులు మాట్లాడుతూ.... పోతంగల్ కోడిచర్ల ఇసుక క్వారీలకు సకాలంలో అనుమతులను మంజూరు చేయడంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. తహసిల్దార్ విష్ణు వారితో మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు పోతంగల్ కోడిచర్ల హంగర్గ క్వారీల నుండి ఇసుక వాహనం అనే పేరుతో మీ సేవ కేంద్రాలలో ఆన్లైన్ చేసుకొని ఇసుక పొందాలని తహసిల్దార్ విష్ణు నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు యాదుల్ కోడిచర్ల మేత్రి నాగేష్ మాజీ ఉప సర్పంచ్ గంగారం పోతంగల్ వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి: ఏపీడబ్ల్యూజేఎఫ్

వి కొత్తకోట ఏప్రిల్:28 (జన సంఘర్షణ)

ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం ఒక కీలక స్థంభంగా నిలుస్తుంది. నిజాలను వెలుగులోకి తెచ్చే పాత్రికేయులు సమాజానికి కళ్లూ చెవులూ అలాంటి బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.ఈ ఘటన కేవలం ఒక వ్యక్తిపై దాడి మాత్రమే కాదు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణించాలని మంగళవారం జర్నలిస్టు యూనియన్ నాయకులు అందరూ కలిసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తన వృత్తి ధర్మాన్ని నిలబెట్టుకుంటూ అనేక సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చారు.అలాంటి వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని హత్య జరగడం వెనుక గల కారణాలను తక్షణమే వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు.నిజాన్ని చెప్పే గొంతులను అణచివేయాలనే ప్రయత్నం ఎప్పుడూ సమాజానికి ప్రమాదకరం అన్నారు.ఈ ఘటనపై ప్రభుత్వం పోలీస్ శాఖ వెంటనే స్పందించి నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని విచారణను వేగవంతంగా పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.అదే సమయంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు వారికి ఆర్థిక సహాయం భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాత్రికేయులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకం అన్నారు. జర్నలిస్టులు భయపడకుండా తమ వృత్తిని కొనసాగించగల వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ హత్యకు కారణమైన వారిని ఎంత పెద్దవారైనా సరే చట్టం ముందు నిలబెట్టాలని న్యాయం జరిగితేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు.జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు సమాజం మీడియా ప్రజా సంస్థలు కలిసి పోరాడాల అని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. “నిజం కోసం పోరాడిన గొంతు మూగబోయినా... ఆ నిజం ఎప్పటికీ నిలుస్తుంది”. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసనగా చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి విచ్చేసి సంఘీభావం తెలిపి ఈ పోరాటాన్ని జయప్రదం చేసిన





ఏపీడబ్ల్యూజేఎఫ్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఏపీబీజేఏ (ఏపీ బి జే ఏ) రాష్ట్ర , జిల్లా కమిటీ సభ్యులకు అలాగే పుంగనూరు నియోజకవర్గ విలేకరి సోదరులందరికీ ఏపీడబ్ల్యూజేఎఫ్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మన ఐక్యతే మన బలం. జర్నలిస్టుల హక్కుల కోసం రక్షణ కోసం మన పోరాటం ఇలాగే కొనసాగించాలని యూనియన్ నాయకులు జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

# గుండెపోటుతో యువ బీ టేక్ విద్యార్థి మృతి

కామారెడ్డి జుక్కల్/ఏప్రిల్ 28/(జన సంఘర్షణ)



కామారెడ్డి జిల్లాజుక్కల్ సెగ్మెంట్లోని నిజాంసాగర్ మండలం వెలగనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ అధ్యక్షులు కయ్యం వీరారెడ్డి ఏకైక కుమారుడు రాజేందర్ రెడ్డి (బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి) సోమవారం రాత్రిహైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆయన చిన్న వయస్సులోనే మృతి చెందడం కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ వార్త తెలుసుకున్న కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తీవ్ర శోకానికి లోనై, మరణించిన యువకుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఏకైక కుమారుడు కనిపించని లోకానికి వెళ్లడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగి పోయారు. స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు విద్యార్థి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# నారాయణపేట జిల్లా ధన్వాడలో విషాదం

◆ **రేపు పెళ్లి... ఈరోజు వరుడు ఉరి వేసుకొని ఆత్మహత్య**



కామారెడ్డి జిల్లా నారాయణపేట/ఏప్రిల్ 28/(జనసంఘర్షణ)

నెల రోజుల నుంచి పెళ్లి ఏర్పాట్లు ఎటు వరుడు, అటు వధువు కుటుంబాల్లో పెళ్లి సంబరాలు కొన్ని సాగుతున్నాయి. కొత్త బట్టలు, పెళ్లికి కావాల్సిన ఏర్పాట్లు విషయంలో రెండు కుటుంబాలు సందడిగా గడుపుతున్నారు. పెళ్లి సమయం దగ్గర పడుతున్న కొద్ది రెండు కుటుంబాల్లో సభ్యులు బిజీబిజీగా గడుపుతున్నారు. తెల్లారితే పెళ్లి.. వరుడికి ఏమైందో ఏందో తెలియదు కానీ ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయిన ఘటన నారాయణపేట జిల్లా ధన్వాడలో చోటుచేసుకుంది. ధన్వాడలో బుధవారం పెళ్లి జరగవలసి ఉండగా మంగళవారం ఉదయం వరుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరుడు కాళోజి మల్లేష్ ఆత్మహత్య చేసుకోవడంతో, రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మంగళవారం దాటితే బుధవారం ఉదయం పెళ్లి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్న వేళ వరుడు ఉరి వేసుకొని చనిపోవడం వెనుక కారణాలేందో తెలియడం లేదంటూ కుటుంబ సభ్యులు వెల్లడిస్తున్నారు.

# రాష్ట్ర డిజిపిగా సివి ఆనంద్ నియామకం

◆ **ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న శివధర్ రెడ్డి**

తెలంగాణ నిజామాబాద్/ఏప్రిల్ 28/(జన సంఘర్షణ)



సీనియార్టీ పరిధిలోకి తీసుకొని రాష్ట్ర డిజిపిగా సివి ఆనంద్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించారు. ప్రస్తుతం పని చేస్తున్న డిజిపి శివలింగ రెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా సివి ఆనంద్ నియమించారు. సివి ఆనంద్ కు నిజామాబాద్ జిల్లాతో అనుబంధం ఉంది. ఆయన నిజామాబాద్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి, పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అంతేకాకుండా పోలీస్ అంటే ప్రజలకు భయం అని ఉండకుండా ప్రేమ కలగాలని ఆ విధంగా పోలీసులు ప్రజల పట్ల ఫ్రెండ్లీగా ఉండాలని సూచించిన సివి ఆనంద్. ఇప్పటికీ సివి ఆనంద్ ను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

# కామారెడ్డికి చేరుకున్న సీతక్క... జిల్లా కలెక్టర్ ఘన స్వాగతం

కామారెడ్డి /ఏప్రిల్ 28/(జన సంఘర్షణ)





కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపనలు, మరొకవైపు వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాలు నిర్వహించడానికి శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం కామారెడ్డికి చేరుకున్నారు. కామారెడ్డికి చేరుకున్న సీతక్కకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

## రజిత పరమేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోత్కూరి శ్రీహిత్ బాబీ





**ఉప్పల్ :**
ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి జన్మదిన సందర్భంగా మోత్కూరి శ్రీహిత్ బాబీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజిత తనకు కేవలం అక్క మాత్రమే కాకుండా అమ్మలా ఆప్యాయతను పంచే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆమె అనురాగంతో ఆదరిస్తూ, నాన్నలా సహకారం అందిస్తూ, బాధల్లో ఓదార్పునిస్తూ, కష్టసమయాల్లో మిత్రుడిలా అండగా నిలుస్తూ ఎల్లప్పుడూ ముందుకు నడిపించే వ్యక్తిగా నిలిచారని అన్నారు. "నీ వెనుక నేనున్నాను" అంటూ ధైర్యం చెప్పే మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి వంటి వ్యక్తి జీవితంలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సంతోషాలతో నిండి మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని శ్రీహిత్ బాబీ ఆకాంక్షించారు.

## రజితమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నెమలి అనిల్ కుమార్



**ఉప్పల్ :**
ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి (రజితమ్మ) జన్మదిన సందర్భంగా మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ రజితమ్మ సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతికి ఆమె చేస్తున్న కృషి మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. వారి నాయకత్వంలో ఇంకా ఎన్నో విజయాలు సాధించి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

**స్కాలర్షిప్లు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్**

**జహీరాబాద్:**
స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నందున వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులను అరెస్ట్ చేసి అఫ్జల్గంజ్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ చర్యను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తూ, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ, స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడం, నాయకులను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును అణచివేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.




## నూతన కమిషనర్ ను కలిసిన టీయుడబ్ల్యూజే నేతలు

**హైదరాబాద్ :**
రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జి.ముకుం దరెడ్డిని, ఇవ్వాళ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఖఔజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బాధ్యులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు.

# మూసివేసిన రేషన్ దుకాణాలను వెంటనే ప్రారంభించాలి

**మేడ్చల్ కలెక్టర్కు వినతిపత్రం అందజేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్ :**
ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూసివేయబడిన రేషన్ దుకాణాలను తక్షణమే తిరిగి ప్రారంభించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్ రెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పౌర సరఫరాల శాఖ ఉప్పల్ సర్కిల్--2 పరిధిలోని పలు రేషన్ దుకాణాలు పనిచేయకపోవడంతో వేలాది మంది రేషన్ కార్డు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా పేదలు, రోజువారీ కూలీలు, వృద్ధులు, వికలాంగులు వంటి ఆర్థికంగా బలహీన వర్గాలపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతోందన్నారు .రేషన్ దుకాణాలు మూసివేయబడటంతో లబ్ధిదారులు అవసరమైన నిత్యావసర సరుకుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ప్రైవేటు మార్కెట్లలో అధిక ధరలకు సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ప్రజల ఆహార భద్రతను దెబ్బతీయడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాన్ని కూడా ప్రభావితం చేస్తోందన్నారు. అందువల్ల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మూసివేసిన రేషన్ దుకాణాలను వెంటనే పునఃప్రారంభించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కలెక్టర్ను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆగం రెడ్డి, పూజారి హనుమంత్ పాల్గొన్నారు.



# మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి.

**సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్**

**హనుమకొండ :**
ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మేడే వారోత్సవాలను (మే 1 నుండి 7 వరకు) జయప్రదం చేయాలని సిఐటియు హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం రామ్ నగర్ లోని సుందరయ్య భవన్ లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షురాలు సుంచు రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగుల రమేష్ మాట్లాడుతూ 140 ఏళ్ల క్రితం చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిందని గుర్తు చేశారు. ఆనాడు కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే 8 గంటల పని విధానం, సెలవులు, సౌకర్యాలు మరియు కనీస వేతన చట్టాలు ఏర్పడ్డాయని తెలియజేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని 4 కార్పొరేట్ అనుకూల 'లేబర్ కోడ్లు'గా మార్చడం కార్మిక వర్గానికి పెను ప్రమాదమని రమేశ్ హెచ్చరించారు. 8గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే వెసులుబాటును ఈ కోడ్లు కల్పిస్తున్నాయని మండిపడ్డారు. యూనియన్లు పెట్టుకునే హక్కును, సమ్మె చేసే అధికారాన్ని ఈ కొత్త చట్టాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'హైర్అండ్ఫైర్' (కావాలన్నప్పుడు తీసుకోవడం, వద్దన్నప్పుడు తీసేయడం) పద్ధతి ద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ మేడేను వారం రోజుల పాటు గ్రామాలలో, కార్మిక వాడలలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. మే 1న అన్ని గ్రామాలలో ,వార్డు లలో యూనియన్ ల అడ్డాల వద్ద ఎర్రజెండాలను ఎగురవేసి కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు యాకూబీ, బైరి శోభ, సిహెచ్ శ్రీవాణి, జనగాం శ్వేత, ఈసంపల్లి శోభ, రజిత, లీల, సంధ్య, నవమణి, సరిత, శోభ, పద్మ, పుతిలి, సుకన్య, పాల్గొన్నారు.






# కార్మిక సంపద కార్పొరేట్లకు కట్టబెడుతున్న పాలకవర్గాలు

**మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి**

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి**

**హనుమకొండ :**
140వ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, కార్మిక హక్కులను కాలరాస్తూ వారు సృష్టించిన సంపదను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్ర విధానాలపై మేడే స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం గుండ్లసింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో ఆ కాలనీ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ మేడే ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేసే విధంగా మేడే స్ఫూర్తితోని మరో ఉద్యమానికి సిద్ధమయ్యే విధంగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రధానంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్ లుగా రూపొందించి ఎన్నో ఏళ్లుగా కార్మిక వర్గం సాధించుకున్నటువంటి హక్కులను కుదించి కార్మిక వర్గం సృష్టించిన సంపదను కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలను రాయితీపరంగా ఇచ్చేటువంటి ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలని కోరారు. భారత్ లో సంపద పెరుగుతున్నప్పటికీ ఆ సంపద కేంద్రీకృతమై ఒక శాతం కుబేర్ల దగ్గర సంపద పోగు పడటంతో దేశంలో పేదరికం, నిరుద్యోగిత, ఆకలి అనారోగ్యం సాధారణమైపోయిందనీ అన్నారు. 44 కార్మిక చట్టాలను తొలగించి 4 కోడ్స్ గా మార్చి కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా తయారుచేసిన కోడ్స్ ను విరమించుకొని యధావిధిగా సామాన్య కార్మికులకు కూడా ఉపయోగపడే విధంగా ఉండే కార్మిక చట్టాలను ఎదా విధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఎన్నికల హామీలను తుంగలో తొక్కి కార్మికులకు కనీస హక్కులు కూడా లేకుండా ఉండే విధంగా ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మికుల హక్కులకై సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని అందులో భాగంగా మే 1వ తేదీన జరిగే మేడే ఉత్సవాలను హనుమకొండ జిల్లాలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను నిర్వహించాలని ఆ మేడేస్ఫూర్తితోని కార్మికుల హక్కుల సాధనకు సిద్ధ కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రామగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, గుంటీ రజిత తదితరులు పాల్గొన్నారు.




# ఏఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు**

**హైదరాబాద్ :**
విద్యార్థుల సమస్యల పరిష్కారంకై సిఎం ఇంటికి పాదయాత్రగా వెళుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్టును సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం (ఏప్రిల్ 28) ఉదయం హిమాయత్ నగర్లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరిన విద్యార్థి నాయకులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారని తెలిపారు. నిరసనకారులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారని తెలిపారు. అలాగే ఆయా జిల్లాలలో కూడా ఎక్కడికక్కడ విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఫీజు రీఎంబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిల చెల్లింపులో జాప్యం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు, మెమోలు, టీసీలు ఇవ్వకుండా వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించి విద్యార్థులకు భరోసా కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## కరాటే లో ఖని విద్యార్థుల గిన్నిస్ వరల్డ్ రికార్డు

:- డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థుల ఘనత



**రామగుండం ఏప్రిల్ 28**

హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీలలో గోదావరిఖని చంద్రశేఖర్ నగర్ కి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు.ఈ సందర్భంగా కరాటే మాస్టర్  పసునూటి చందు మాట్లా డుతూ హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం లో నిర్వహించిన ఈ పోటీలలో సుమారు రెండు వేల మందికి పైగా విద్యార్థులు,మాస్టర్స్ పాల్గొని,కాటా విభాగంలో ఏకదాటిగా 40 సార్లు కాటా చేయటం వలన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించినట్లు అయన తెలిపారు.క్లబ్ నుండి సీని యర్స్,జూనియర్స్,టింగు జయ సాయి చరణ్,సహస్ర, ఆయన్ష్,కృతిక్,సాయి రోషన్, స్పందన,అనన్య,ఎం.డి జైన్,సర్విన్ రెడ్డి,లాస్య ప్రియా, ప్రణీత్,రోనీత్ కుమార్,లక్ష్మి ప్రియా, రిషిత,అక్షయ్,అభిషేక్, సాత్విక్ నందన్,రజినీకాంత్ భవాని,వాసికర్,శ్రీ హర్షిత్,నేత్ర, శ్రీ వికసిని,స్మితేష్,శ్రీ హరిషిని, భార్గవ రామ,అశ్విత్ రెడ్డి, శైలందర్,దీపిక దుర్గ,సాత్విక్,శ్రీ నందన్,శ్రీ సిద్విక్,అధ్య,శాన్వి శ్రీ, అక్షిత,రికార్డ్ సాధించారుఈ .రికార్డ్ సాధించిన విద్యా ర్థులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,మరియు తల్లిదండ్రులు అభినందనలు తెలి పారు.ద

## వివాదాస్పద భూమిలో అటవీ శాఖ రెవెన్యూ శాఖ సంయుక్త సర్వే.



**దౌల్తాబాద్ ఏప్రిల్ 28 :**

దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగాయపల్లి తండా, మహమ్మద్ షాపూర్ గ్రామాల శివారులో ఉన్న సర్వే నెంబర్ 147లో భూవివాదంపై అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఈ భూమి విషయంలో రైతులు మరియు అటవీ శాఖ అధికారుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు ఈ సర్వే చేపట్టారు. సర్వే సందర్భంగా భూహద్దులను గుర్తిస్తూ, భూమి స్వభావం, పూర్వ రికార్డులు, పటాలు, సర్వే వివరాలను అధికారులు పరిశీలించారు. రైతులు తమ వాదనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అటవీ శాఖ ప్రతినిధులు తమ ఆధారాలను సమర్పించారు. ఇరు వర్గాల వాదనలు విన్న అధికారులు వాస్తవ పరిస్థితులను నమోదు చేసి నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వివాదాస్పద భూమిపై స్పష్టత తీసుకురావడమే లక్ష్యంగా జాయింట్ సర్వే నిర్వహిస్తున్నామని, అన్ని ఆధారాలను పరిశీలించిన అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు కూడా సమస్యకు శాశ్వత పరిష్కారం రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఐ సేవాలాల్ నాయక్, దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ అధికారి సందీప్, సెక్షన్ అధికారి హైమద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ వేణు, మండల సర్వేయర్ రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయ పొలం సందర్శన



**రాజాపేట ఏప్రిల్ 28 :**

రాజాపేట చెందిన స్వరన్ పాల్ సింగ్ సేంద్రియ వ్యవసాయ పొలాన్ని యాదాద్రి భువనగిరి  జిల్లా వ్యవసాయ అధికారి పి వెంకటరమణారెడ్డి సందర్శించారు. రైతు పండిస్తున్నటు వంటి సమగ్ర సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతు ద్వారా అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రాబోయే రోజులలో అందరూ రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని రైతు చేస్తున్నటువంటి పనిని సంతృప్తి వ్యక్తం చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల వ్యవసాయ అధికారిని, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి...

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి...
- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా  రైతుల ఖాతాల్లోకే నగదు జమ కావాలి
- అన్నదాతల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కినప్పుడే వ్యవసాయం పండుగలా మారుతుంది
- కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి
- ప్రకృతి వైపరీత్యాల వేళ రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే రైతు సంక్షేమమే ముఖ్యం..
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**సుజాతనగర్ :**

రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబ శివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజా తనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. వ్యవసాయాధారిత ప్రాంతమైన మన జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నష్టపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించిందని తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహ రించాలని, ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. తూకంలో తేడాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని, ప్రభుత్వం నుండి రైతులకు రావాల్సిన ప్రతి పైసాను ఇప్పించే బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి



ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, 21 డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన బస్ సర్వీస్‌కు స్వాగతం పలికిన మల్లికుదుర్ల గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్

**వేలేరు :**

వేలేరు మండల పరిధిలోని మల్లికుదుర్ల గ్రామ ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్ ప్రత్యేక చొరవతో నూతన బస్ సర్వీస్‌ను గ్రామానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో బస్సు సౌకర్యం కోసం ఆమె పట్టుదలతో కృషి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కొత్త బస్ సర్వీస్‌ను ప్రారంభించాలని జనగాం డిపో మేనేజర్‌ను పలుమార్లు కలిసి వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. దీనిపై డిపో అధికారులు సానుకూలంగా స్పందించి సోమవారం నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. కొత్తగా ప్రారంభమైన బస్సుకు సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్ కొబ్బరికాయ కొట్టి స్వాగతం పలికారు. అనంతరం డ్రైవర్, కండక్టర్‌ను అభినందిస్తూ ప్రయాణికులతో సౌహార్దంగా వ్యవహరించి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు. కండక్టర్



మాట్లాడుతూ ఈ బస్ సర్వీస్ కోసం జక్కుల సంపత్ యాదవ్ పలుమార్లు డిపో చుట్టూ తిరిగి చివరకు గ్రామానికి ఈ సేవను తీసుకువచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికుదుర్ల ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వీధులను విశాలంగా ఉంచుకోవాలి

:- నగర మేయర్ మహంకాళి స్వామి

**రామగుండం,ఏప్రిల్ 28 :**

వీధులు విశాలంగా ఉంచుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలను కోరారు.వార్డు సందర్శనలో భాగంగా మంగళ వారం 47 వ డివిజన్ మార్కండేయ కాలనీలో స్థానిక కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ఆక్రమించి ఇంటి ముందు గద్దెలు,మెట్లు నిర్మిం చడం,చెట్ల కొమ్మలతో, పిచ్చి చెట్లతో దారి మూసుకుపోయేలా చేయడం వలన ప్రమాదాలు జరుతున్నాయని అన్నారు. ఎంఎల్ఎ రాజ్ ఠాకూర్ సూచనల మేరకు వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని,వార్డు సందర్శనలో భాగంగా నగర పాలక సంస్థపై ఆర్థిక భారం పడకుండా డ్రైనేజ్ పూడిక తీత,పిచ్చి చెట్ల తొలగింపు వంటి స్పెషల్ డ్రైవ్ సానిటేషన్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని,ఈ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత రాకుండా ఎం ఎల్ ఎ కోట్లాది రూపాయలు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. సుమారు రూ 800 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసా గుతున్న తరుణంలో మిగిలిపోయిన ప్రాంతాల్లో కూడా రోడ్లు, యు జి డి వేయడంతో పాటు స్థానికుల కోరిక మేరకు హను మాన్



గుడి వీధిలో కల్వర్ట్ కూడా నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తామని,స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడానికి జరుగుతున్న ప్రయత్నానికి తమ వంతుగా బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు.కాగా మేయర్ ఆదేశాల ప్రకారం జెసిబి యంత్రాలతో మార్కండేయ కాలనీ మేజర్ నాలాలో పూడిక తొలగించే పనులు చేపట్టారు. నాలా ప్రక్కన ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి చెట్లు తొలగించి శుభ్రం చేయించారు.ఇండ్ల ముందు స్థలం ఆక్రమించి నిర్మించిన గద్దెలు తొలగించారు. రోడ్డు మీదకు వేలాడుతున్న చెట్ల కొమ్మలను నరికివేశారు.గోడల ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లను, పొదలను తొలగించి వీధులు విశాలంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.ఈ సంధర్భంగా స్థానికులు నోటు పుస్తకాలు అందించి మేయర్ కు ఘన స్వాగతం పలికారు.ఈ కార్య క్రమంలో కార్పొరేటర్ వడ్లూరి రవి,నగర పాలక సంస్థ ఇ ఇ.పి వి.రామన్,టి పి ఎస్ నవీన్,డి ఇఇ అఫ్తాబ్, సూపరిం టెండెంట్ పబ్బాల శ్రీనివాస్,జవాన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co